‘రేషన్’లో రాష్ట్ర వాటా కోత

- పదికి బదులు ఐదు కిలోలే పంపిణీ
- కేంద్ర ప్రభుత్వ కోటాతో సరి
- రెండు నెలలుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వ రేషన్ బియ్యం
- అర్ధాకలితో నిరుపేదలు




లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

నల్లబెల్లి : ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే ఉచిత రేషన్ బియ్యంలో రాష్ట్ర సర్కార్ కోత విధించింది.. కరోనా కష్టకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక్కో లబ్ధిదారుడికి 10 కిలోల చొప్పున బియ్యం అందజేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని ఏడాదిపాటు పొడిగించింది. కానీ నూతన సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వ కోటా బంద్ చేసింది. ప్రస్తుతం కేంద్రం వాటానే లబ్ధిదారుడికి 5 కిలోల బియ్యమే అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను అందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో పేదలు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

మండలంలో రేషన్ బియ్యం పంపిణీ ఇలా..

మండలవ్యాప్తంగా 30 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో గత డిసెంబర్ వరకు బియ్యం సక్రమంగానే సరాఫరా అయ్యాయి. గతేడాది డిసెంబర్ నెలలో అంత్యోదయ 806, ఆహార భద్రత 10,569 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 361.685 క్వింటాళ్ల బియ్యాన్ని అందించాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలలో సైతం ఈ మేరకే కోటా బియ్యం అందించాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించాల్సిన బియ్యాన్ని కోత విధించడంతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యంతోనే సరి పెడుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో అంత్యోదయ కార్డులు 815, ఆహార భద్రత కార్డులు 10,613 ఉండగా లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని 190.475 క్వింటాళ్ల బియాన్ని మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో రేషన్ బియ్యంపైనే ఆధారపడిన వారు అర్ధాకలితో అలమటిస్తున్నామని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా సరఫరా చేస్తూ.. గతంలో లాగా 10 కిలోల చొప్పున బియ్యం పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పది కిలోల బియ్యం ఇవ్వాలి



నా కుటుంబానికి ఆహార భద్రత కార్డు ఉంది. గతంలో 10 కిలోల చొప్పున బియ్యం ఇచ్చేవారు. రెండు నెలలుగా 5కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నారు. దీంతో అర్ధాకలితో అలమటించాల్సి వస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు స్పందించి ప్రతి లబ్ధిదారుడికి 10 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలి.

– అజ్మీరా కాంతమ్మ, లక్ష్మితండా

రాష్ట్ర ప్రభుత్వ కోటా రావడం లేదు



ఆహార భద్రత కార్డు లబ్ధిదారులకు డిసెంబర్ నెల వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5కిలోల చొప్పున 10 కిలోలు అందించేది. రెండు నెలలుగా కేంద్ర ప్రభుత్వం మాత్రమే 5 కిలోల బియ్యం సరఫరా చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ కోటా నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులకు ప్రస్తుతం 5 కిలోల చొప్పున మాత్రమే రేషన్ డీలర్లు పంపిణీ చేస్తున్నారు.

– దూలం మంజుల, తహసీల్దార్, నల్లబెల్లి

ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర


ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలనే కుట్రలో భాగంగానే బడ్జెట్‌లో రూ.29వేల కోట్ల నిధుల కోత పెట్టిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉపాధి కార్డు పొందిన కూలీలు ఉపాధి పొందలేకపోతున్నారన్నారు. టెక్నికల్ సమస్యలతో ఉపాధి కూలీ పని చేసినా మస్టర్లలో నమోదు కాకపోవడంతో కూలీలు నష్టపోతున్నారన్నారు. త్వరలోనే వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసే వరకు గ్రామీణ స్థాయి నుంచి పోరాటం చేస్తామన్నారు. ఈజీఎస్‌లో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ, టీఏ, సీఓ, సీఏ, ఏపీఓ సమస్యలను ముఖ్యమంత్రి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ రావు, బీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య, టీఆర్ఎస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, విజయ్, మేకల రవి, గోనె యువరాజు, జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


నర్సంపేట: మాట్లాడుతున్న దేవేందర్

నర్సంపేట : వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న గిరిజన విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యా యత్నానికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ప్రీతిని కొద్ది రోజులుగా సీనియర్ విద్యార్థి సైఫ్ ర్యాగింగ్ పేరిట వేధింపులకు గురి చేస్తున్నాడని విద్యార్థిని పలుమార్లు కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందన్నారు. వెంటనే కళాశాల యాజమాన్యం స్పందించి సైఫ్ డిగ్రీని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మరిన్ని ఇలాంటి సంఘటనలు జరుగకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దు, అఖిల్, రాజేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.


చెన్నారావుపేట: వినతిపత్రం ఇస్తున్న బాధ్యులు

నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలి

చెన్నారావుపేట : వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతూ ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న ప్రీతిని వేధించిన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని గోర్ సేనా జిల్లా అధ్యక్షుడు ధరావత్ కిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెడిసిన్ చదువుతూ ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న గిరిజన విద్యార్థి ప్రీతి సీనియర్ విద్యార్థుల వేధింపులు తాళలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. ప్రీతికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ అశోక్‌నాయక్, భాస్కర్ నాయక్, వినోద్ నాయక్, విజయ్ నాయక్, అనిల్ నాయక్, సుమన్ నాయక్ తదితరులు ఉన్నారు.

వైకల్య నిర్ధారణ పరీక్షలు


దివ్యాంగుడికి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం శిబిరంలో శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 81 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 94మంది దరఖాస్తు చేసుకోగా 81మంది హాజరయ్యారు. కాగా వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అర్హులైన దివ్యాంగులకు డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు అందజేస్తారని అధికారులు తెలిపారు. ఈ సదరం శిబిరంలో వైద్యులు సారంగపాణి, అంజయ్య ఆడియాలజిస్టు, మానసిక విభాగం డాక్టర్ రాము నాయక్, వీరన్న, సైక్రియాట్రిస్టులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి, సదరం విభాగం అధికారులు రవి, కృష్ణ, శైలజ పాల్గొన్నారు.

కొలను వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని కల్లెడ కొలను వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీరంగాచార్యులు స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణ తంతు కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మత్స్యసొసైటీ ఎన్నికలకు 42 నామినేషన్లు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ చేయగా 9 డైరెక్టర్ స్థానాలకు 42 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లను స్క్రూటినీ చేసినట్లు, 42 మంది బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ ముగియగానే తుది జాబితాను ఎన్నికల చిహ్నాలతో సాయంత్రం 5 గంటలకు ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

పెద్దకోడెపాక గ్రామంలోని రైతు వేదికలో మార్చి 2న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తామని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సభ్యులు సహకరించాలని ఆయన కోరారు.

ఆలయంలో చోరీ


పగులగొట్టిన హుండీని చూపిస్తున్న గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని కొండూరులో శుక్రవారం సీతారామచంద్ర ఆలయంలో దొంగలు హుండీ పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. దేవాలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వీరమనేని సత్యనారాయణ కథనం ప్రకారం.. గ్రామంలోని సీతారామచంద్రాలయంలో ఏర్పాటు చేసిన హుండీలో ఉన్న డబ్బులను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. హుండీని గ్రామశివారులో వదిలి వెళ్లారు. ఈవిషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనం..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి సమీపం చలపర్తి శివారులో గురువారం రాత్రి ఇంటి ఎదుట నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. చలపర్తి గ్రామానికి చెందిన సార ప్రశాంత్ గిర్నిబావికి సమీపంలో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిని ఆనుకుని నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం తన ఇంటి ఎదుట గ్లామర్ బైక్ (టీఎస్24సి0922) ఉంచి నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం లేచి చూసేసరికి వాహనం లేదు. దీంతో తన వాహనం చోరి జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

మరో ఇంట్లో చోరీకి విఫలయత్నం

ఇదే చలపర్తి గ్రామశివారులో వరంగల్–నర్సంపేట రోడ్డు పక్కన ఒంటరిగా ఇల్లు నిర్మించుకుని ఉంటున్న నల్ల కమలాకర్‌రెడ్డి ఇంటి గేట్‌పై నుంచి ఇద్దరు వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దూకారు. శబ్దానికి అక్కడే ఉన్న మేకలు, గొర్రెలు అరిచాయి. కమలాకర్ కర్ర తీసుకుని బయటికి రావడంతో దొంగలు పరారయ్యారు.

అవగాహన

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల రైతు వేదికలో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ, ఇన్సెక్టిసైడ్ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఓ హరిప్రసాద్‌బాబు, కంపెనీ సేల్స్ ఆఫీసర్ కె. కిరణ్‌ప్రసాద్, ఏఈఓ ఎండి అబీద్ హుస్సేన్, రాజ్‌కుమార్, అనిల్, డీలర్ కిరణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


పెర్కవేడులో బాధిత కుటుంబానికి నగదుతో పాటు బియ్యం అందజేస్తున్న సర్పంచ్

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన వేల్పుల సోమయ్య ఇటీవల మృతిచెందాడు. కాగా సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం 50 కేజీల బియ్యంతోపాటు రూ.2వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల సమ్మయ్య, ఆకారపు వెంకటాచారి, ఎండీ అంజద్ పాషా, గారె కిరణ్, బందు రాజు, నిమ్మల రాజు, ఐత వెంకన్న, తాటికాయల మహేందర్, తాటికాయల సైదులు, గారె రమేష్, గారె రాజు, గారె యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ శిబిరాన్ని వినియోగించుకోవాలి


రాయపర్తి: జేతురాంతండాలో కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది


చెన్నారావుపేట: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భాస్కర్, డాక్టర్ పవన్



చెన్నారావుపేట : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మాదారపు భాస్కర్, డాక్టర్ పవన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగగిరి గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల కోసం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశామని తెలపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పర్కాల లక్ష్మీ, రాజన్న, ఉప సర్పంచ్ బూరుగు రాజశేఖర్, వార్డు సభ్యులు, క్యాంపు ఇన్‌చార్జ్ కుండె శివాజీ, నరేష్, ఏఎన్ఎం అరుణ, సుధ, ఆశ వర్కర్లు ఉన్నారు.

జేతురాంతండాలో..

రాయపర్తి : మండలంలోని జేతురాంతండాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ నేతావత్ కిషన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మిట్టపల్లి రాకేష్‌కుమార్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరంగల్ (పర్వతగిరి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కమలపంతులు, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని గోపనపల్లి గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ మహేష్, ఉపసర్పంచ్ సూర అశోక్, ఎంపీటీసీ సూర రమేష్, ఉపాధ్యాయులు, వైద్యాధికారులు, మల్టీ వర్కర్స్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో..

జైలుకు బెల్లం విక్రయదారుల తరలింపు


జైలుకు తరలిస్తున్న ఎక్సైజ్ సీఐ భిక్షపతి

గూడూరు: ప్రభుత్వ నిషేధిత అక్రమ నల్లబెల్లం, నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడిన వారికి జైలు శిక్షలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసముద్రం మండలం భవానిగడ్డ తండాకు చెందిన ఇద్దరు నల్లబెల్లం, నాటుసారా తయారీ విక్రయదారులపై పీడీ యాక్ట్ కేసుతోపాటు, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి చర్లపల్లి జైలుకు పంపించినట్లు సీఐ తెలిపారు. భవానిగడ్డతండాకు చెందిన నూనావత్ కిషన్, నూనావత్ రాము అనే ఇద్దరు వ్యక్తులు కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి అక్రమంగా నల్లబెల్లం రవాణకు పాల్పడుతూ పలు సార్లు చిక్కారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జయశ్రీగౌడ్, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుల్ సుధాకర్, నరేష్, యుగంధర్, దేవేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మత్స్య సొసైటీల్లో సభ్యత్వం

ఐనవోలు : అర్హులకు మత్స్య సొసైటీల్లో సభ్యత్వం కల్పించనున్నట్లు మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) భారతి తెలిపారు. మండలంలోని సింగారం గ్రామ ఊరచెరువులో గ్రామానికి చెందిన 61 మంది ముదిరాజ్ కులస్తులకు శుక్రవారం ఈత కొట్టడం, వల విసురుడు , పెద్ద వల లాగడం, తెప్ప మీద వెళ్లి చేపలు పట్టడం, తదితర అంశాల్లో నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఏడీ భారతి హాజరై పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. 18 ఏళ్లకు పైబడ్డ వారు ముదిరాజ్ కులస్తులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారికి మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీలో సభ్యులుగా చేరుస్తామని చెప్పారు. గ్రామ సొసైటీలో గతంలో 73 మంది ఉండగా వారిలో 33 మంది చనిపోగా ప్రస్తుతం 40 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు బుస్స మల్లేశం మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు సభ్యత్వం కల్పించాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటేశ్వర్లు, ముత్యాల ఉప్పలయ్య, ఇండ్ల కుమారస్వామి, బొల్లు రాములు, సొన బోయిన సతీష్ ఉన్నారు.

ఇద్దరికి గాయాలు


గాయపడిన సైకిలిస్టు

వర్ధన్నపేట : ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న ద్విచక్ర వాహనదారుడితో పాటు సైకిలిస్టుకు గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో జరిగింది. వరంగల్ వైపునకు లోడుతో వెళ్తున్న లారీని ఇల్లంద గ్రామ శివారు వివేకానంద సెంటర్ వద్ద జాతీయ రహదారిపై ఓవర్ టేక్ చేసి ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్ర వాహనదారుడు తప్పించబోయాడు. ఓవర్ టెక్ చేసిన లారీ ముందుకు వెళ్లడంతో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయగా ద్విచక్ర వాహనం వెనకాల నుంచి లారీని ఢీ కొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు బ్రేక్ వేసిన సమయంలో వెనకాల వస్తున్న సైకిలిస్టు లారీని వెనక నుంచి ఢీ కొన్నారు. దీంతో ఇద్దరికి గాయాలు కావడంతో వారిని వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రమాదంలో సైకిలిస్టుకు, ద్విచక్ర వాహనదారుడికి ప్రాణాపాయం తప్పింది.

క్లుప్తంగా

జీవాలకు నట్టల నివారణ మందు



వరంగల్ (పర్వతగిరి) : జీవాలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందును తాగించాలని జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని దౌలత్‌నగర్‌లో శుక్రవారం జీవాలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తులు శుక్రవారం పెద్దమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే మహిళలు భక్తి శ్రద్ధలతో ఇళ్లలో బోనాలు తయారు చేశారు. సాయంత్రం గ్రామంలోని ముదిరాజ్ కుల మహిళలందరూ నెత్తిపై బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్లతో గ్రామ శివారులోని పెద్దమ్మ గుడికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి మల్లికాంబ, ఉపసర్పంచ్ ప్రతాప్, ముదిరాజ్ కుల పెద్దలు లింగయ్య, సురేష్, మల్లేశం, నాగరాజు, నారాయణ, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలన సామాజిక బాధ్యత



ఆత్మకూరు : టీబీ నిర్మూలన సామాజిక బాధ్యత అని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు అభివర్ణించారు. నిక్షయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని తిరుమలగిరి గ్రామంలోని కేజీబీవీలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్షయ సమూల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. టీబీ లక్షణాలు, వ్యాప్తి చెందే అవకాశాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు తల్లిదండ్రులకు టీబీపై అవగాహన కల్పించారు. అనంతరం‘టీబీ నిర్మూలన, మనందరి బాధ్యత’ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, కేజీబీవీ ప్రిన్సిపాల్ వాసవి, హెచ్‌వి నర్మద తదితరులు పాల్గొన్నారు.

నగదు, బియ్యం అందజేత

ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన గుడికందుల అశోక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి టెన్త్ చదువుకున్న మిత్రులు శుక్రవారం రూ.14 వేల నగదు, క్వింటా బియ్యం అందించి అండగా నిలిచారు. తొలుత అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో అశోక్ మిత్రులు వెంకటేశ్, పురుషోత్తం, మధు, కుమార్, దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

పాకాలవాగులో మృతదేహం

గూడూరు : పాకాలవాగు బ్రిడ్జి కింద శుక్రవారం ఉదయం మృతదేహం లభించినట్లు ఎస్సై సతీష్‌గౌడ్ తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ కేంద్రం సర్వాపురం గ్రామానికి చెందిన ఎల్లాపురం రమేష్ (35)గా వాట్సాప్ గ్రూపుల్లో చూసిన అతడి బంధువులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఎల్లాపురం రమేష్‌కు ఇద్దరు భార్యలు ఉన్నట్లు, పెద్ద భార్య భవానికి ఇద్దరు కొడుకులు ఉండగా, రమేష్ మరో మహిళతో కాపురం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడని, మృతదేహాన్ని చూసిన మొదటి భార్య భవాని తెలిపింది. ఎలా చనిపోయాడు, ఇక్కడికి ఎలా వచ్చాడో తనకు తెలియదని, రమేష్‌కు తల్లి ఉందని, శనివారం ఆమెతోపాటు మరో మహిళను తీసుకొని వస్తానని చెప్పిందని ఎస్సై తెలిపారు. ఎలా చనిపోయాడనే వివరాలు రేపు వారిని విచారించాక తెలుస్తుందన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఆత్మకూరు : అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి కోరారు. మండల కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. పనులు సకాలంలో, నాణ్యతతో చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కడపాక రాజేందర్, పీడీఎస్‌యూ సెక్రటరీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.